క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండ



ఆర్థికసాయం అందిస్తున్న ఉద్యోగులు

సోన్: తమతో కలిసి పని చేసే వ్యక్తి చనిపోవడంతో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు తోటి సిబ్బంది. సోన్ మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజాలో పని చేసే లక్ష్మణచాంద మండలం కంజర గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. టోల్‌ప్లాజా సిబ్బంది తలో కొంత పోగు చేసి ఆదివారం బాధిత కుటుంబానికి రూ.41వేలను సర్పంచ్ శోభారాణి చేతుల మీదుగా అందించి ఉదారత చాటుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రహమాన్, టోల్‌ప్లాజా ఉద్యోగులు దేవేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాజేశ్వర్, రాంగోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాజిరెడ్డి తల్లి మల్లవ్వ శనివారం రాత్రి మృతి చెందింది. ఆదివారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ రాజేందర్, ఎంపీటీసీ పుప్పాల స్వప్న, సర్పంచ్ మహేందర్, శంకర్ తదితరులు ఉన్నారు.

'విమర్శలు సరికాదు'

లోకేశ్వరం: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని బీజేపీ నాయకులు విమర్శించడం సరికాదని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు భుజంగ్‌రావు అన్నారు. ఆదివారం లోకేశ్వరంలోని బీఆర్‌ఎస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, కపిల్, లింగన్న, రాజు, ప్రశాంత్, భూమన్న పాల్గొన్నారు.

ఆర్య మరాఠా మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులు


తానూరు: మండల కేంద్రంలోని కల్యాణ మండలంలో ఆదివారం ఆర్య మరాఠ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా శివాజీ పటేల్, ఉపాధ్యక్షుడిగా మాధవ్‌రావ్ పటేల్, కార్యదర్శిగా గోవింద్‌రావ్ పటేల్, క్యాషియర్‌గా సురేశ్‌పటేల్, సభ్యులుగా మధుపటేల్, రమేశ్‌పటేల్, భగవాన్ పటేల్, శంకర్, నాగభూషన్, భీంరావ్, బాలాజీ, నందుపటేల్, సురేశ్, లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జీకేపటేల్, ఉపాధ్యక్షుడు ఆనంద్‌రావ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా గోవర్ధన్



లక్ష్మణచాంద: లక్ష్మణచాంద మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా పాలాస గోవర్ధన్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం బీజేపీ జిల్లా కమిటీ ఆమోదం నేపథ్యంలో గోవర్ధన్‌ను ప్రకటించినట్లు వారు పేర్కొన్నారు

ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నరేందర్



నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బర్కుంట నరేందర్‌ను ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భాషా, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

వేణుగోపాలస్వామి కల్యాణం

లక్ష్మణచాంద: దక్షిణ భారతదేశంలో ఏకైక అష్ట భుజ వేణుగోపాలస్వామి ఆలయం ఉన్న మండల కేంద్రంలో ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని సర్పంచ్ ముత్యంరెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణం నిర్వహించారు. జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీటీసీ గడ్డం నర్సారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ రవికిరణ్, వీడీసీ సభ్యులు రాంరెడ్డి, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ రాజశ్యామలదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. శివరాజా యోగి కృష్ణస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు.

ఆరోగ్య ఉపకేంద్రాలకు మహర్దశ

- దూరం కానున్న మండలవాసుల ఇబ్బందులు
- బోరిగాంలో తప్ప అన్నిచోట్ల సొంత భవనాలు
- నాణ్యమైన సేవలతో ఓపీ పెరుగుతుందంటున్న వైద్యసిబ్బంది



ప్రారంభానికి సిద్ధంగా మల్లాపూర్ ఉపకేంద్ర భవనం



వడ్యాల్‌లో చివరి దశకు చేరిన ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణం

లక్ష్మణచాంద: పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా లక్ష్మణచాంద మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఆసుపత్రులకు సొంత భవనాలను కూడా సమకూరుస్తోంది. లక్ష్మణచాంద పీహెచ్‌సీ పరిధిలో లక్ష్మణచాంద, మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. న్యూవెల్మల్ బొప్పారం పీహెచ్‌సీ పరిధిలో వడ్యాల్, బోరిగాం గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలుగా పేరు మార్చింది. నాణ్యమైన వైద్య సేవలు అందుతుండటంతో మండల ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండల జనాభా 36వేలు..

2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 36వేల జనాభా. లక్ష్మణచాంద మండలవ్యాప్తంగా దాదాపు అన్ని ఆసుపత్రులకు సొంత భవనాలున్నాయి. మల్లాపూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తవగా ప్రారంభించాల్సి ఉంది. ప్రస్తుతం పాఠశాలలో కొనసాగుతోంది. వడ్యాల్‌లో ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మండలంలో ఒక్క బోరిగాంలో మాత్రమే ఆరోగ్య ఉపకేంద్రానికి సొంత భవనం లేదు.

వడ్యాల్ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో..

మండలంలోని వడ్యాల్ ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో వడ్యాల్, వడ్యాల్‌తండా, రాచాపూర్, పొట్టపెల్లి(కే), కనకాపూర్ గ్రామాలు ఉన్నాయి. గతంలో ఆరోగ్య ఉప కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో వడ్యాల్ ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిలో ఆరోగ్య ఉప కేంద్రం కొనసాగుతోంది. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడేవారు.

ఈ సమస్యను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి వైద్య ఆరోగ్యశాఖ నుంచి రూ.16లక్షల నిధులు మంజూరు చేశారు. స్లాబ్ పూర్తి కావడంతో ప్లాస్టింగ్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది..

మండల ప్రజలకు పూర్తిస్థాయిలో సర్కారు వైద్య సేవలు అందుతున్నాయి. అందులో భాగంగా అన్ని పీహెచ్‌సీ, ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో పూర్తిస్థాయిలో సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. వడ్యాల్ సబ్‌సెంటర్ పరిధిలో ఏఎన్‌ఎం–1 పోస్టు, బోరిగాం ఉపకేంద్రం పరిధిలో ఏఎన్‌ఎం–2 పోస్టు ఖాళీగా ఉన్నాయి. దీంతో గతంతో పోలిస్తే ప్రస్తుతం సర్కారు ఆసుపత్రులకు వచ్చే ప్రజల సంఖ్య పెరిగిందని వైద్యసిబ్బంది పేర్కొంటున్నారు.

తొలగిపోనున్న ఇబ్బందులు



ప్రస్తుతం ఆరోగ్య ఉపకేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో పాఠశాలలోని ఒక గదిలో కొనసాగుతోంది. దీంతో ఇక్కడకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో నిర్మిస్తున్న నూతన భవనంతో అందరికీ ఇబ్బందులు తొలగిపోనున్నాయి.
– లలిత, వడ్యాల్ సర్పంచ్

మంత్రి ఐకేరెడ్డి కృషితో



వడ్యాల్‌లో ఉపకేంద్రానికి సొంత భవనం లేక ఇబ్బంది అవుతుందని గ్రామస్తులం మంత్రి ఐకేరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన మంత్రి సొంత భవనానికి రూ.16లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. – రాజేంద్రప్రసాద్, వడ్యాల్

దళారులకు అమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముథోల్: వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వడ్తాల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు ఇబ్బందులు కల్గకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు సైతం నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, జెడ్పీటీసీ సురేందర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీపీ రవీందర్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణుల సంఘం మండలాధ్యక్షుడు యోగేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం

భైంసా: బాసర మండల విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలాధ్యక్షుడు యోగేశ్‌చారి మాట్లాడుతూ బాసరలో విశ్వబ్రాహ్మణుల సంఘం ఏర్పాటుకు భవనం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు జిడ్డు మల్లయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష



ఖానాపూర్: పరీక్షకేంద్రం వద్ద నీడలో పోషకులు



కుంటాలలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు

ఖానాపూర్: గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. పట్టణంలోని శాంతినగర్‌తోపాటు జేకేనగర్ కాలనీలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలల వద్ద సందడి నెలకొంది. ఎంజేపీ బాలుర పాఠశాలలో 462 మందికి గాను 445మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ విశ్వేశ్వర్ తెలిపారు. ఎంజేపీ బాలికల పాఠశాలలో 240 మందికి గాను 220 మంది హాజరైనట్లు సీఎస్ సృజన తెలిపారు.

కేంద్రాల వద్ద వేచిచూసిన పోషకులు..

పరీక్షకు చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు తరలివచ్చారు. రోజంతా పరీక్ష కేంద్రాల సమీపంలోని చెట్ల నీడలో, పలువురి నివాసాల వద్ద విద్యార్థులు బయటకు వచ్చేవరకు వేచిచూశారు.

సారంగాపూర్: మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకులంలో 504మందికిగాను 476మంది హాజరయ్యారని.. మిగతా 28 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రమాకల్యాణి తెలిపారు. పరీక్షకు వచ్చిన విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు కేంద్రం బయట నిల్చొని అవస్థలు పడ్డారు. పాఠశాల ప్రహరీ లోపల ఉన్న వెయిటింగ్ హాల్‌లోకి అనుమతిస్తే బాగుండేదని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో 384 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 22 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై హన్మాండ్లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముథోల్: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకులంలో 504 మందికి గాను 482 మంది హాజరవగా 22 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే మహాత్మా జ్యోతిబాపూలే పరీక్ష కేంద్రంలో 240 మందికిగాను 235 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

సోన్: లెఫ్ట్ పోచంపాడ్‌లో టీఎండబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో 480 మంది విద్యార్థులకు గాను 447 మంది హాజరయ్యారు. సీఎస్ సరస్వతి పాల్గొన్నారు.

'బచ్‌పన్‌కే దోస్త్' కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సొసైటీ బాధ్యులు

నిర్మల్: సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజ సేవలో భాగమవుతామని బచ్‌పన్‌కే దోస్త్ సొసైటీ బాధ్యులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాగులవాడ శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో 1997–98లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 'బచ్‌పన్‌కే దోస్త్' పేరిట సొసైటీ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఇంద్రానగర్ సంక్షేమ సంఘ భవనంలో ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూదరి సాయికృష్ణ, గౌరవ అధ్యక్షులుగా కూన రమేశ్, డొంగరి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా గురుడు తిరుమలేశ్, ఉపాధ్యక్షులుగా బట్టు సంతోశ్‌రాజ్, గన్ను రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారులుగా గుర్రం శ్రీనివాస్, బసంత సాయిరాం, సంయుక్త కార్యదర్శిగా అబ్దుల్ అజీజ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా పొడెల్లి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా గంజి రాజారమేశ్, న్యాయ కార్యదర్శిగా ఒడ్నం మధుకర్, సభ్యులుగా పఠాని ప్రవీణ్, ఒడ్నం వేణుగోపాల్, కూచాడి నర్సింగ్‌రావు, వేముల నర్సయ్య, చింతపండు ప్రవీణ్, కుంట వెంకటరమణ, అప్పాల వంశీకృష్ణ, బండారి భీమేశ్, రావుల శ్రీనివాస్, రాసం శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంబేద్కర్ జయంతి

భైంసారూరల్: మండలంలోని ఎగ్గాం గ్రామంలో ఆదివారం అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అంతకుముందు పంచశీల్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగాధర్, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, పలువురు భారతీయ బౌద్ధమహాసభ నాయకులు, పలువురు భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఈద్‌గాం వద్ద రూ.ఐదు లక్షల నిధులతో అంబేద్కర్ సంఘ ప్రహరీ నిర్మాణానికి ఆదివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ భూమిపూజ చేశారు. కౌన్సిలర్ నామెడ రమ్య–విజయ్, బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు నామెడ గజేందర్, గంగన్న పాల్గొన్నారు. ధర్మసాగర్ వద్ద రూ.రెండు కోట్లతో నిర్మించే దోబీఘాట్ ఏర్పాటుకు రజక సంఘం కమిటీ సభ్యులతో కలిసి చైర్మన్ ఈశ్వర్ స్థలం పరిశీలించారు. ఏఈ హరిభూషన్, కౌన్సిలర్ ఖాజా మాజిదొద్దీన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

కడెం: వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెకు నాయకులు మద్దతు తెలుపుతున్నారు. ఆదివారం సమ్మె కడెంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మద్దతు మద్దతు పలికారు.

పెంబి: మండల కేంద్రంలో వీవోఏలు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. సీఐటియూ జిల్లా కార్యదర్శి సురేశ్, యూనియన్, వీవోఏలు ఉన్నారు.

మామడ: వీఓఏలు బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు శ్వేత, రజిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద:తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వీవోఏలు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి లావణ్య, పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలో వీవోఏలు టెంట్ వద్ద బతుకమ్మ ఆడి వినూత్న నిరసన తెలిపారు. లావణ్య, గంగాధర్, రవీందర్, పల్లవి, శ్రీలత తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. అధ్వానంగా రోడ్డు



కుభీర్: మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని హిమాయిత్‌నగర్‌కు వెళ్లే అంతరాష్ట్ర రోడ్డు ఏడు కిలోమీటర్ల మేర కంకర తేలిపోయి అధ్వానంగా మారింది. దీంతో మండలంలోని ఐదు తండాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.
ప్రశ్నించాల్సిన అధికారి: పీఆర్ ఏఈ, సూర్యతేజ, ఫోన్: 77028 88482

నేడు సన్నాహక సమావేశం

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీనగర్ రాంలీలా మైదానంలో నూతనంగా నిర్మించే శివ రామాలయం కోసం సోమవారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ నిర్మాణ తాత్కాలిక కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. రాంలీలా మైదానంలో రాత్రి ఏడు గంటలకు నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పాన్కల్‌లో వైద్యశిబిరం

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో ఆదివారం జిల్లా కేంద్రానికి చెందిన స్వప్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ భూమేశ్వర్, వైద్యులు శశికాంత్, స్వప్న పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

సోన్: మండలంలోని మాదాపూర్‌లో జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం, మంత్రి ఐకేరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మండలంలోని సోన్ ఐబీ నుంచి గాంధీనగర్ వరకు రూ.14 కోట్లతో డబుల్‌రోడ్డు, మాదాపూర్ నుంచి జాఫ్రాపూర్ వరకు రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు క్షీరాభిషేకం చేశారు.

'భగీరథ' పనుల్లో అనధికార విద్యుత్ వినియోగం.!



రాహుల్‌నగర్‌లో ఎల్‌టీ లైన్ నుంచి తీగలతో విద్యుత్ వినియోగం

భైంసాటౌన్: పట్టణంలో మిషన్ భగీరథ పనులు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల డీఐ పైపులు వేస్తుండగా మరికొన్ని చోట్ల హెచ్‌డీపీఈ పైపులు వేస్తున్నారు. అయితే హెచ్‌డీపీఈ పైపులు వేస్తున్న చోట్ల పైపులను ఒకదానికొకటి జాయింట్ చేసే క్రమంలో పైపులను వేడి చేసి అతికిస్తున్నారు. ఇందుకుగాను విద్యుత్‌ను నేరుగా ఎల్‌టీ లైన్ నుంచి వినియోగిస్తున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ భైంసా ఏఈ మోహన్‌ను వివరణ కోరగా అనుమతి లేకుండా విద్యుత్‌ను వినియోగం చేయవద్దన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి



భైంసాలో లింగాయత్‌ల శోభాయాత్ర



నిర్మల్‌లో పూలమాలలు వేస్తున్న లింగాయత్‌లు

భైంసాటౌన్: పట్టణంలో ఆదివారం బసవేశ్వర జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి నిర్వహించారు. పట్టణంలోని లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డు మీదుగా బసవేశ్వర చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తూ భజనలు చేశారు. మారుతి, రాంపటేల్, యోగేశ్, విశ్వనాథ్, తదితరులున్నారు.

భైంసా: బాసరలో బసవేశ్వర జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయం వద్ద బసవేశ్వరచౌక్ వద్ద బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేశారు. సర్పంచ్ లక్ష్మణ్ రావు, ఎంపీపీ సునీత విశ్వనాథ్ పటేల్, వైస్ ఎంపీపీ నర్సింగరావు, జెడ్పీటీసీ వసంత రమేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్యాం, లింగయత్ చిట్టిపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తానూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వర జయంతి నిర్వహించారు. ఆర్ఐ గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, సర్పంచ్ విఠల్, బాశెట్టి రాజన్న, దిగాంబర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: మండల కేంద్రంలోని జంగంగల్లిలో బసవేశ్వర జయంతి నిర్వహించారు. సర్పంచ్ రాజేందర్ బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం సంఘ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మారుతి, నాగేశ్ పటేల్, పోతన్న, పోతన్న, సోమేశ్‌పటేల్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: సమాజంలో కుల,మత, వర్ణ భేదాలు లేకుండా అందరూ సమానులేనని చాటి చెప్పిన మహనీయుడు బసవేశ్వర మహారాజ్ అని వీరశైవ లింగాయత్ పట్టణ అధ్యక్షుడు పండరినాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బసవేశ్వర జయంతి నిర్వహించారు. లింగాయత్ కులస్తుల ఆధ్వర్యంలో పురవీధుల గుండా సంప్రదాయ నృత్యాలతో శోభాయాత్ర చేశారు. కస్బా గల్లీలో బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేశారు.

వంట చేస్తుండగా సిలిండర్ నుంచి మంటలు

- ఆర్పే క్రమంలో ఒకరికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- కడెం మండలం ఉప్పరిగూడెంలో ఘటన



తీవ్రంగా గాయపడ్డ బాలరాజు



మంటల్లో దెబ్బతిన్న సామగ్రి

కడెం: వంటగ్యాస్ సిలిండర్‌లో మంటలు లేచి ఒకరు తీవ్రంగా గాయపడ్డ ఘటన మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధిలోని ఉప్పరిగూడెంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన కమ్మరి బాలరాజు భార్య ఊరెళ్లడంతో..రాత్రి తన రేకులఇంట్లో వంట చేసుకుంటున్నాడు. సిలిండర్‌పై వంట ప్రారంభించి బయటకు వచ్చాడు. ఈక్రమంలో రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బయటకు వచ్చిన బాలరాజు హుటాహుటిన ఇంట్లోకి వెళ్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన గ్రామస్తులు బాలరాజును బయటకు తీసుకొచ్చారు. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పూర్తిగా మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో వంట సామగ్రి, బెడ్‌లు, ఇతర సామగ్రి కలిపి సుమారు.రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది. బాలరాజును అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.